సాక్షి
కామారెడ్డి
శనివారం । 28 । డిసెంబర్ । 2024



పన్ను చెల్లిస్తేనే..

శాఖా గ్రంథాలయాల్లో సమస్యలు పరిష్కారం కావడం గ్రామపంచాయతీలు చెల్లించే పన్నుపై ఆధారపడింది.

- 10లో ▸



నాసిరకంగా రోడ్ల నిర్మాణం

నస్రుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్ - మైలారం, మిర్జాపూర్ - బీర్పూర్ మధ్య రోడ్లు ప్రమాదకరంగా మారాయి.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.4 /20.3

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గృహనిర్మాణ శాఖ పీడీగా విజయపాల్‌రెడ్డి



కామారెడ్డి క్రైం: కామారెడ్డి గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ గా పి విజయపాల్‌రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం కామారెడ్డికి విచ్చేసిన ఆయన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ్‌పాల్‌రెడ్డి ఇదివరకు హైదరాబాద్ రాజీవ్ స్వగృహలో పనిచేశారు.

కామారెడ్డి డిపోను నంబర్‌వన్‌గా నిలపాలి



కామారెడ్డి టౌన్: ఉమ్మడి జిల్లాలో కామారెడ్డి ఆర్టీసీ డిపోను నంబర్ వన్‌గా నిలపాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జోత్స్న అన్నారు. శుక్రవారం ఆమె కామారెడ్డి డిపోను సందర్శించగా, మేనేజర్ ఇందిర ఆమెకు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. డిపో ఆవరణలో సిబ్బందితో కలిసి ఆర్ఎం మొక్కలను నాటారు. అనంతరం గ్యారేజీలో ఉద్యోగులు, కండక్టర్లు, డ్రైవర్లతో సమావేశమైన ఆర్ఎం.. సమష్టి కృషితో ఆర్టీసీని మరింత లాభాల బాటలో తీసుకెళ్లాలని కోరారు. ప్రమాదరహిత డిపోగా పేరు తీసుకురావాలని, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని డ్రైవర్లు, కండక్టర్లకు సూచించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ సరస్వతి, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రభుత్వం ఉద్యోగుల సేవలను గుర్తించడం లేదు'



కామారెడ్డి టౌన్: తమ డిమాండ్లను పరిష్కరించాలని చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె శుక్రవారం 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె శిబిరం నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఎస్ఎస్ఏ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సేవలను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమను విద్యాశాఖలో విలీనం చేసి, క్రమబద్ధీకరణ చేయాలని, అప్పటి వరకు పేస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షులు వాసంతి, నాయకులు రాములు, సంతోష్ రెడ్డి, వనజ, శైలజ, వీణ, లావణ్య పాల్గొన్నారు.

29న ఎమ్మెల్సీ కవిత రాక

నిజామాబాద్ అర్బన్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 29న నిజామాబాద్ వస్తున్నారని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్‌రావు సంయుక్త ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లి వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలకనున్నారు.

'సాగర్' జలాలు వృథా!



ఆయకట్టు కింద పంటల సాగు అవసరాలకు ప్రధాన కాలువ ద్వారా విడుదలవుతున్న నిజాంసాగర్ ప్రాజెక్టు జలాలు వృథా అవుతున్నాయి. నిజాంసాగర్ ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న హెడ్‌రెగ్యులేటర్ గేట్ల ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టు జలాలు మంజీరా నదిలోకి వెళ్తున్నాయి. రెండు, మూడు రోజులుగా నీరు మంజీరలోకి వెళ్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. హెడ్‌రెగ్యులేటర్ గేట్లను ఎత్తింది ఎవరనేది చర్చనీయాంశమైంది.

– నిజాంసాగర్(జుక్కల్)



భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట పీఎస్ కానిస్టేబుల్ శృతి, కంప్యూటర్ ఆపరేటర్ శివ మృతి మిస్టరీని ఛేదించే పనిలో ఉన్న పోలీసులకు ఆ ముగ్గురి వాట్సాప్ చాటింగ్, వారు ప్రయాణించిన ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీ కీలకమైంది. ముగ్గురూ మృతి చెందడంతో అసలేం జరిగి ఉంటుందనేది పెద్ద ప్రశ్నగా మిగిలింది. ఈ క్రమంలో పోలీసులు ముగ్గురి ఫోన్‌లలోని వాట్సాప్ చాటింగ్‌పై ఆధారపడ్డారు. అలాగే సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

సీసీ ఫుటేజీ.. వాట్సాప్ చాటింగ్‌లే కీలక ఆధారం!

ముగ్గురి మృతి మిస్టరీ తేల్చేపనిలో పోలీసులు

- కాల్‌డేటా పరిశీలన
- ఫోన్‌ల లాక్ ఓపెన్ అయితేనే స్పష్టత వచ్చే అవకాశం
- ముగ్గురు ఎందుకు కలవాల్సి వచ్చిందనే దానిపై దృష్టి
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఏకకాలంలో జరిగిన ముగ్గురి మరణాల మిస్టరీని తేల్చేందుకు పోలీసు అధికారులు విచారణ ముమ్మరం చేశారు. చాలా కాలంగా క్లోజ్‌గా ఉన్న వాళ్లు కలిసి చనిపోవడానికి కారణాలు ఏమిటనేదానిపై ఆరా తీస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో బుధవారం సాయంత్రం భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేటకు చెందిన నిఖిల్‌లు చనిపోయిన విషయం తెలిసిందే. ఎస్సై, మహిళా కానిస్టేబుల్ చనిపోయిన ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు విచారణను వేగవంతం చేశారు. కేసు మిస్టరీని ఛేదించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై సాయికుమార్ వద్ద రెండు ఫోన్లు, కానిస్టేబుల్ శ్రుతి ఒక ఫోన్, నిఖిల్ రెండు ఫోన్లు వాడినట్లు నిర్ధారణకు వచ్చారు. ముగ్గురి కాల్ డేటాను ఇప్పటికే పరిశీలించారు. గడిచిన వారం రోజుల్లో ముగ్గురు పలుమార్లు కాల్స్ మాట్లాడినట్లు కాల్‌డేటా ద్వారా వెల్లడైనట్లు తెలుస్తోంది. ముగ్గురి మధ్య ఉన్న పరిచయాలు, వాళ్లు సడెన్‌గా ఆ రోజు ఎందుకు కలవాల్సి వచ్చింది ? అక్కడ జరిగిన గొడవ ఏమిటి? అనే అంశాలపై పోలీసులు ఫోకస్ చేస్తున్నారు.



సాయికుమార్ (ఫైల్)



శ్రుతి (ఫైల్)



నిఖిల్ (ఫైల్)

వాట్సాప్ చాటింగ్‌లో ఏముందో..

ముగ్గురు కూడా రెగ్యులర్‌గా వాట్సాప్ వాడుతున్నట్లు పోలీసులు తమ ప్రాథమిక విచారణలో నిర్ధారించుకున్నారు. ఎస్సై సాయికుమార్ వాడుతున్న రెండు ఫోన్‌లలో ఒకటి కారులో ఉండగా, మరో ఫోన్ ఆయన ప్యాంట్ జేబులోనే ఉండిపోయింది. నీటిలో మునిగిపోవడంతో ఫోన్ ఆన్ కావడం లేదని తెలుస్తోంది. కారులో ఉన్న ఐ ఫోన్ స్క్రీన్ లాక్ ఉండడంతో ఓపెన్ చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. అయితే ఎస్సై ఫోన్ లాక్ గురించి ఆయన భార్యను తెలుసుకునే ప్రయత్నం చేయగా, తనకు తెలియదనే సమాధానం వచ్చినట్లు సమాచారం. నిఖిల్ వాడుతున్న రెండు ఫోన్‌లలో ఒకటి లాక్ ఓపెన్ కావడం లేదని, మరొకదానిలో పెద్దగా చాటింగ్ లేనట్లు చెబుతున్నారు. శ్రుతి ఫోన్ లాక్ సైతం ఓపెన్ కాలేదని తెలుస్తోంది. వాటిని ఓపెన్ చేయించేందుకు పోలీసు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వాట్సాప్ చాటింగ్‌లో కచ్చితంగా ఏదో ఒక ఆధారం దొరుకుతుందనే నమ్మకంతో పోలీసులు ఉన్నారు.

భిక్కనూరు నుంచి అడ్లూర్ ఎల్లారెడ్డి దాకా..

విచారణలో భాగంగా పోలీసు అధికారులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. భిక్కనూరు టోల్ ప్లాజా దగ్గర నుంచి మొదలుకుని అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వరకు జాతీయ రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. జాతీయ రహదారిపై ఓ దాబా హోటల్ సమీపంలో నిఖిల్ బైకును ఇప్పటికే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ హోటల్ వద్ద కలిసి భోజనం చేశారన్న ప్రచారం జరగడంతో అధికారులు హోటల్ సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే అక్కడ సీసీ ఫుటేజీని చెక్ చేసే క్రమంలో అవి పనిచేయడం లేదని చెబుతున్నారు. అక్కడి నుంచి ముగ్గురు కలిసి కారులో కామారెడ్డి పట్టణంలోకి రాకుండా బైపాస్ రోడ్డు గుండానే నిజామాబాద్ రూట్లో వెళ్లినట్టు భావిస్తున్నారు. అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు సమీపంలో రోడ్డు పక్కన కారు ఆపుకుని డిస్కషన్ చేసి ఉంటారని, తరువాత ఎవరి కంట పడకుండా ఉండేందుకు చెరువు కట్టపైకి వెళ్లి ఉండొచ్చని భావిస్తున్నారు. ఏది ఏమైనా ముగ్గురి చావుల మిస్టరీ తేల్చడం పోలీసులకు సవాల్‌గానే మారిందని చెప్పాలి.

మహిళాసంఘాల్లో కొత్త వెలుగులు



ఆత్మకూర్‌లో సమావేశమైన మహిళాసంఘం సభ్యులు (ఫైల్)

- కొత్తవారిని సంఘాల్లో చేర్పించేందుకు ఐకేపీ సిబ్బంది కసరత్తు
- జిల్లాలో 17,045 సంఘాలు.. లక్షా79వేల 65మంది సభ్యులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళలకు ఆర్థికపరమైన చేయూతనిచ్చేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మహిళాసంఘాల్లో ఐకేపీ సిబ్బంది కొత్త వెలుగులు నింపుతున్నారు. సంఘాల్లో కొత్త సభ్యులను చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం గ్రామాల్లో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మహిళాసంఘాల సభ్యుల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాల కారణంగా గ్రామాల్లోని చాలామంది మహిళలు సంఘాల్లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు.

జిల్లాలో 82శాతం లక్ష్యం పూర్తి

మహిళాసంఘాల్లో సభ్యులుగా చేరేందుకు 18 నుంచి 60ఏళ్లలోపు మహిళలు అర్హులు. ప్రస్తుతం జిల్లాలోని 17,045 సంఘాల్లో 1,79,065 మంది సభ్యులు ఉన్నారు. కాగా 2024–25 సంవత్సరంలో 7,414మంది సభ్యులను నూతనంగా సంఘాల్లో చేర్పించాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు 6,129మందిని నూతన సభ్యులుగా చేర్పించి 82శాతం లక్ష్యాన్ని పూర్తిచేశారు. మిగతా లక్ష్యాన్ని వచ్చేఏడాది మార్చి నెలాఖరు వరకు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఆకర్షిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు

మహిళాసంఘాల సభ్యుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు మహిళలను ఆకట్టుకుంటున్నాయి. మహిళాసంఘాల్లోని సభ్యులకు వడ్డీ లేని రుణాలను ఇవ్వడంతోపాటు సంఘంలోని సభ్యురాలు అకస్మాత్తుగా మరణిస్తే అప్పటివరకు సభ్యురాలిపై ఉన్న అప్పు నిల్వ(రూ.2 లక్షలలోపు) మాఫీ కానుంది. దీంతోపాటు సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే నిల్వ ఉన్న అప్పు మాఫీకావడంతోపాటు నామినీకి రూ.10 లక్షలు ఇవ్వనున్నారు. అంతేకాకుండా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో సభ్యత్వం ఇవ్వడంతోపాటు మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా సంఘాల్లోని సభ్యులకు పలు రకాల ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ క్రమంలో మహిళాసంఘాల్లో చేరేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు.

నూతన సభ్యులను చేర్పిస్తున్నాం

గ్రామీణ ప్రాంతాల్లో 18 నుంచి 60 ఏళ్లలోపు వయసున్న వారిని మహిళాసంఘాల్లో సభ్యులుగా చేర్పిస్తున్నాం. మహిళాసంఘాల్లోని సభ్యుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలామంది మహిళలు సంఘాల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– సుధాకర్, డీపీఎం, కామారెడ్డి

వాయిదాపడ్డ పాసింగ్ అవుట్ పరేడ్

డిచ్‌పల్లి: మండలంలోని రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్లో శిక్షణ పూర్తి చేసుకున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లకు శుక్రవారం నిర్వహించాల్సిన పాసింగ్ అవుట్ పరేడ్ (పీవోపీ)ను వాయిదా వేసినట్లు కమాండెంట్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో ప్రభుత్వం శుక్రవారం సెలవుతోపాటు వారంపాటు సంతాప దినాలు నిర్వహించాలని ప్రకటించిందన్నారు. దీంతో పాసింగ్ అవుట్ పరేడ్‌ను వాయిదా వేసినట్లు తెలిపారు. త్వరలోనే పీవోపీ నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటు

కామారెడ్డి టౌన్/బాన్సువాడ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి, బాన్సువాడలో శుక్రవారం వారు మన్మోహన్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ హయాంలోనే ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నామని గుర్తు చేశారు. ఆర్థిక, వాణిజ్య మంత్రిగా, ఆర్థిక సలహాదారుగా పని చేసి దేశం సంక్షోభంలో ఉన్నప్పుడు ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి నిలబెట్టారని కొనియాడారు. రెండుసార్లు దేశానికి ప్రధానమంత్రిగా చేసిన ఘనత మన్మోహన్ సింగ్‌కు దక్కుతుందన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. నివాళులు అర్పించిన వారిలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలియాజ్, నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, పండ్ల రాజు తదితరులున్నారు.





నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి

దివ్యాంగులకు అందని విద్య



ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కేంద్రం

- సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో నిలిచిన బోధన
- జిల్లాలో 23 భవిత కేంద్రాలు..
- 340 మంది దివ్యాంగ చిన్నారులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఐఈఆర్పీ (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్) ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో ప్రత్యేక అవసరాలు ఉన్న దివ్యాంగ చిన్నారులకు గత 15రోజులుగా విద్యాబోధన నిలిచిపోయింది. జిల్లాలో 23 భవిత కేంద్రాలు, 340 మంది ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులు ఉన్నారు. ఐదు చోట్ల సొంత భవనాలు ఉండగా మిగతా 18 చోట్ల మండల కేంద్రాల పరిధిలోని పలు పాఠశాలల్లో ఒక గదిని భవిత కేంద్రానికి కేటాయించడం జరిగింది. నడవడం, చదవడం, రాయడం, చూడడం తదితర ఇబ్బందులు చిన్నారులను భవిత కేంద్రాలకు తీసుకువెళ్లి అక్కడ ఫిజియోథెరపి చేయించడం, చదవించడం, రాయించడం, నడవడం నేర్పించడం జరుగుతుంది. వీరికి బోధించే ఐఈఆర్పీలు సమ్మె చేస్తుండడంతో బోధన నిలిచి పోయింది. జిల్లాలో 44 మంది ఐఆర్ఈపీలకు గాను 20 మంది ఉన్నారు. దీంతో దివ్యాంగులు ఇబ్బందుల పాలవుతున్నారు. సక్రమంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు బోధన లేకపోతే వారు చదువులో వెనక బడతారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు విద్యా బోధన జరిగేలా చర్యలను తీసుకోవాలని కోరుతున్నారు.

దివ్యాంగులకు పాఠాలు బోధించాలి

దివ్యాంగులకు పాఠాలు బోధించేలా చర్యలు తీసుకోవాలి. 15 రోజులుగా దివ్యాంగులకు బోధన లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. భవిత కేంద్రాలు ప్రతి రోజూ సక్రమంగా నడిచేలా చూడాలి. – బాలరాజు, లింగారెడ్డిపేట

క్యాంపులు నిర్వహిస్తున్నాం

భవిత కేంద్రాల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల ద్వారా ఫిజియోథెరపి క్యాంపులు నిర్వహిస్తున్నాం. ఐఈఆర్పీలు సమ్మెలో ఉండడంతో విద్యాబోధన ఇబ్బందిగా ఉంది. భవిత కేంద్రాల్లో సైతం బోధన జరిగేలా తగిన చర్యలు తీసుకుంటాం. – కృష్ణచైతన్య, సెక్టోరియల్ అధికారి, కామారెడ్డి

పట్టాలున్నా తప్పని పరేషాన్

- ఆర్‌వోఎఫ్‌ఆర్ భూముల పట్టాలు ఉత్తవేనా?
- విద్యుత్ కనెక్షన్‌ల కోసం రైతుల ఎదురు చూపులు
- తమ బాధ్యత కాదంటున్న రెవెన్యూ అధికారులు
- అనుమతి తప్పనిసరంటున్న విద్యుత్ అధికారులు
- పోడు రైతుల గోడు వినేదెవరు?

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : పోడు భూములకు పట్టాలు పొందిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. తాతల కాలం నుంచి తాము సాగు చేస్తున్న భూములపై హక్కులు పొందినందుకు సంతోషించాలో..? పంటల సాగుకోసం విద్యుత్ కనెక్షన్ తీసుకునే పరిస్థితి లేనందుకు బాధపడాలో..? అర్థంకాని స్థితిలో రైతులు ఉన్నారు. గత ప్రభుత్వం 2020 ఫిబ్రవరిలో పోడు భూములకు పట్టాలు ఇచ్చిన విషయం తెలిసిందే. పట్టాలు పొందిన రైతుల్లో సంతోషం కనిపించడం లేదు. దానికి కారణం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం రైతులకు డీడీల అనుమతులు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు నిరాకరించడమే. ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన భూములకు విద్యుత్ కనెక్షన్ ఎందుకు ఇవ్వరు అని రైతులు ప్రశ్నిస్తుండగా, తమకు దానికి సంబంధించిన ఆదేశాలు లేవంటూ అధికారులు అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండడంతో తమ గోడు పట్టించుకునే వారు ఎవరు అని పోడు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాన్సువాడ నియోజకవర్గంలో 1833 మందికి సుమారు 3380 ఎకరాల పోడు భూముల పట్టాలను అందజేశారు. ఒక్క నస్రుల్లాబాద్ మండలంలోని సంగం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 296లో దాదాపు 1184 ఎకరాల భూమిని తాతాల కాలం నుంచి గ్రామానికి చెందిన గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. రెవెన్యూ శాఖ అధికారుల సర్వే ప్రకారం 245 ఎకరాలకుగాను లబ్ధిదారులను పట్టాదార్ పాస్ పుస్తకాలకు అర్హులుగా గుర్తించి 210 మందికి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను అందజేశారు.

దాటవేస్తున్న రెవెన్యూ అధికారులు

వ్యవసాయ భూముల్లో బోరుబావి తవ్వకానికి రెవెన్యూ అధికారుల అనుమతుల తప్పని సరి అనేది నిబంధన. అయితే ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాదారులు ఇంత కాలం ఆరుతడి పంటలను సాగుచేస్తూ కబ్జాలో ఉన్నారు. పట్టా పాస్‌పుస్తకాలు అందడంతో ప్రస్తుతం రెండు పంటలను తీసేందుకు సిద్ధమయ్యారు. గతేడాది వేసవిలో రైతులు బోరుబావులు తవ్వించి భూమిని అభివృద్ధి చేసుకున్నారు. బోరు మోటారు దించేందుకు విద్యుత్ అవసరం కావడంతో సంబంధిత అధికారులు ఆశ్రయించారు. రెవెన్యూ అధికారుల అనుమతులు చూపాలంటూ విద్యుత్ అధికారులు రైతులకు సూచించగా, ఆర్‌వోఎఫ్‌ఆర్ భూములకు అనుమతుల అంశం తమ చేతిలో లేదని రెవెన్యూ అధికారులు దాటవేస్తున్నారు. తహసీల్ కార్యాలయాల చుట్టూ తిప్పుకుని కొందరు చేతులు తడిపిన తరువాతే అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఇది ఒక్క సంగం గ్రామ సమస్య కాదని వివిధ మండలాల్లో ఉన్న పోడు భూముల రైతుల ఆవేదన అని అంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రైతులందరికీ విద్యుత్ కనెక్షన్‌ల కోసం డీడీలకు అనుమతులు ఇప్పించాలని వేడుకుంటున్నారు.

అధికారుల లెక్కలకు మించి బోర్లు

సంగం, హాజీపూర్, అంకోల్ తండా గ్రామాల్లో ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలున్న రైతులు ఉండగా, సంగం సబ్ స్టేషన్ పరిధిలో అధికారుల లెక్కలకు మించి బోర్లు నడుస్తున్నాయి. ఓ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీకి మించి బోర్లు ఉన్నాయి. ఒక్కో ట్రాన్స్ ఫార్మర్ కింద అనధికారికంగా 4 నుంచి 5 బోర్లు నడుస్తున్నాయి. విద్యుత్ కనెక్షన్ అవసరం ఉన్న వారితోపాటు అనధికారికంగా విద్యుత్ వాడుకుంటున్న రైతులు సైతం డీడీలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా రెవెన్యూ అధికారులు సహకరించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పోడు భూమిలో రైతులు సాగుచేస్తున్న పంట

నా కొడుకు 2, 3సార్లు వెళ్లాడు



అనుమతి కోసం తహసీల్ కార్యాలయానికి నా కొడుకు రెండుమూడు సార్లు వెళ్లాడు. అధికారులు ఈరోజు రేపు అంటూ తిప్పుతున్నారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ భూములకు డీడీలు తీసుకోవడానికి వెంటనే అనుమతించాలి. – శంకర్‌నాయక్, రైతు, సంగం

అనుమతులు ఇప్పించండి



ఆర్‌వోఎఫ్‌ఆర్ భూములకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తే బోర్లు వేయించుకుని పంట పండిస్తాం. సంబంధిత అధికారులు వెంటనే అనుమతులు ఇస్తే రైతులను ఆదుకున్న వారవుతారు. – రవి, రైతు, సంగం

వెళ్లాలంటే భయమేస్తోంది



నాకు రెండు ఎకరాల ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా పాస్ పుస్తకం ఉంది. తోటి వారు పడే ఇబ్బంది చూసి విద్యుత్ డీడీ కోసం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లాలంటేనే భయమేస్తోంది. అధికారుల తిప్పుకుంటున్నారని చెబుతున్నారు. – శ్రీను, రైతు, సంగం

అవకాశం కల్పించాలి



పట్టా పాస్‌పుస్తకాలు ఇచ్చారు. కానీ విద్యుత్ వినియోగానికి అనుమతులు ఇవ్వడానికి ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని న్యాయంగా విద్యుత్ ఉపయోగించుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నాం. – శివ, రైతు, సంగం

క్లుప్తంగా

సెలవుల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల సర్వే



బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే బాన్సువాడ మండలంలో నత్తనడకన సాగుతోంది. దీంతో సర్వేను త్వరిత గతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సర్వేలో వెనుక బడ్డ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సెలవు దినాల్లోనూ పల్లెబాట పట్టారు. ప్రజాపాలనతో దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి ఆన్‌లైన్‌లో సర్వే వివరాలు నమోదు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న వారితో పాటు ఇంటి నిర్మాణానికి ముందుకు వచ్చే వారి వివరాలను నమోదు చేస్తున్నారు.

లింగంపేటలో..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయితీల్లో సర్వే కొనసాగుతుంది. శుక్రవారం నాటికి 65 శాతం పూర్తి అయినట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. శుక్రవారం మెంగారం, అయ్యపల్లి, మోతె, పొల్కంపేట, కోమటిపల్లి, శెట్పల్లి, భవానిపేట తదితర గ్రామాల్లో సర్వే నిర్వహించామన్నారు. కార్యదర్శి శ్రావణ్ కుమార్ ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పకడ్బందీగా చేపట్టాలి



బీబీపేట: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. అలాగే లబ్ధిదారుల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో పక్కాగా పొందుపర్చాలని సూచించారు. కార్యదర్శి రమేష్, శ్రీనివాస్ ఉన్నారు.

పన్ను చెల్లిస్తేనే దన్నుగా నిలిచేది..!

- శాఖా గ్రంథాలయాలలో మౌలిక వసతులు కరువు
- పేరుకుపోయిన గ్రంథాలయ సెస్సు (పన్ను)
- జిల్లాలో మొత్తం రూ.2 కోట్ల 45 లక్షల బకాయిలు



తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న నాగిరెడ్డిపేట గ్రంథాలయం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): శాఖా గ్రంథాలయాలలో నెలకొన్న సమస్యల తీరాలంటే గ్రామ పంచాయతీల ద్వారా చెల్లించే గ్రంథాలయ సెస్సు(పన్ను) రాబట్టాల్సిందే. ప్రతియేటా గ్రామ పంచాయతీలు చెల్లించే గ్రంథాలయ పన్నులే వాటికి దన్నుగా నిలవనున్నాయి. విజ్ఞాన భాండాగారాలుగా పేరొందిన గ్రంథాలయాలలో సరైన వసతులు లేక పాఠకులతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 20 గ్రంథాలయాలున్నాయి. వాటిలో నాగిరెడ్డిపేట, గాంధారి, మాచారెడ్డి, బాన్సువాడ, బీర్కూర్ లలోని శాఖా గ్రంథాలయాలకు సొంత భవనాలు లేవు. దీంతో ఆయా మండలాల్లోని గ్రంథాలయాలు ప్రస్తుతం తాత్కాలికంగా ఇతర భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతోపాటు జిల్లాలో 22 మంది గ్రంథపాలకులుండాల్సి ఉండగా ప్రస్తుతం ఐదుగురు మాత్రమే రెగ్యులర్ గ్రంథపాలకులు ఉన్నారు. వీరితోపాటు మరో నలుగురు అవుట్ సోర్సింగ్ విధానంలో, మరో 8 మంది పార్ట్ టైం విధానంలో గ్రంథపాలకులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొంత మందికి ఇతర మండలాల్లోని గ్రంథాలయాల ఇన్‌చార్జి బాధ్యతలు ఉండడంతో పాఠకులకు పూర్తిస్థాయిలో సేవలు అందడంలేదు.

ప్రతిఏడాది రూ.80 లక్షల సెస్సు వసూలు..

జిల్లాలోని గ్రామ పంచాయతీల ద్వారా ప్రతిఏడాది రూ.80 లక్షల గ్రంథాలయ పన్ను వసూలు కావాల్సి ఉంది. కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీలలో వంద శాతం ఇంటి పన్నులు వసూలవుతున్నప్పటికీ గ్రంథాలయ పన్నులు చెల్లించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే జిల్లాలో గ్రంథాలయ పన్నులు బకాయిపడినట్లు తెలుస్తోంది. గ్రంథాలయ పన్నులు సకాలంలో చెల్లిస్తే జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంతోపాటు మండలాల్లోని శాఖా గ్రంథాలయాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించవచ్చు. దీంతోపాటు గ్రంథాలయాలకు నిత్యం వచ్చే పాఠకులకు అవసరమైన సదుపాలయాలను కల్పించవచ్చు. జిల్లాలోని చాలా గ్రంథాలయాలకు పోటీపరీక్షలకు సంబంధించిన వీక్లీ, మంత్లీ మ్యాగజైన్లు రావడంలేదు. మరికొన్ని గ్రంథాలయాలలో టాయ్‌లెట్స్ సదుపాయాలు కూడా లేవు. దీనివల్ల ప్రతిరోజూ గ్రంథాలయాలకు వచ్చే పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై నిలదీయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి



రామారెడ్డిలో నియామకపత్రాలతో బూత్ కమిటీ సభ్యులు, బాణాల లక్ష్మారెడ్డి

రామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల తాలూకా అమలును క్షేత్రస్థాయిలో గ్రామాలలో తిరిగి నిలదీయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం పలు బీజేపీ బూత్ కమిటీలను నియమించారు. అనంతరం బాణాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఏడాది గడిచినా రైతుబంధు వేయలేదని, రైతులు అప్పుల కుప్పల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆరోపించారు. సంక్రాంతి లోపు రైతుబంధును రైతుల ఖాతాలో జమ చేయకపోతే బీజేపీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్, మండల అధ్యక్షులు ఈశ్వర్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గిద్ద వెంకన్న, రామారెడ్డి మాజీ సర్పంచ్ సంజీవ్, బూత్ అధ్యక్షుడు నర్సింలు, సందీప్, దేమే సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా వెంకట ఖాజా వార్షికోత్సవం



ఆశ్రమంలో గురువులను సన్మానిస్తున్న భక్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వెంకట ఖాజా ఆశ్రమంలో 21వ ఉర్సు వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం భక్తులు గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కవ్వాలి, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆశ్రమం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు గంధం, పూలు ఊరేగించారు. భక్తులు అంకం కొండయ్య చిస్తీ, బాబా, చిరంజీవులు, గురుదేవ్, రాజు, శశికాంత్, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా రోడ్ల నిర్మాణం



మైలారం-మిర్జాపూర్ మధ్య గుంతల రోడ్డు



ప్రమాదకరంగా మారిన మిర్జాపూర్-వీరాపూర్ రోడ్డు

- కొద్ది రోజులకే ధ్వంసమైన వైనం
- చీకటి పడితే ప్రయాణం ప్రమాదమే

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మిర్జాపూర్-,మైలారం, మిర్జాపూర్-వీరాపూర్ మధ్య రోడ్లు ప్రమాదకరంగా మారాయి. ఈ దారిలో ప్రయాణం చేయాలంటే సాహసం ప్రదర్శించాల్సిందే. చీకటి పడితే ఈ రోడ్డు పై ప్రయాణం ప్రమాదకరమే అని ప్రజలు వాపోతున్నారు. నిత్యం పంట పొలాలకు, బాన్సువాడకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఇది ఇలా ఉండగా దుర్కి-మిర్జాపూర్ రోడ్డు గతంలో శంకుస్థాపన చేసిన అనంతరం పనులు నిలిచిపోయాయి. దీనితో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



దుర్కి-మిర్జాపూర్ గ్రామాల మధ్య మరమ్మతులకు నోచుకోని రోడ్డు

జిల్లా తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడిగా నరేందర్‌గౌడ్



కృతజ్ఞతలు తెలుపుతున్న జిల్లా అధ్యక్షుడు నరేందర్‌గౌడ్

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల తహసీల్దార్ చెట్లపల్లి రాజా నరేందర్‌గౌడ్ తెలంగాణ తహసీల్దార్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రాములును శుక్రవారం హైదరాబాదులో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహం అడ్డగింత



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో శుక్రవారం అధికారులు బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన కుమ్మరి అశోక్-స్వరూపల కూతురు వివాహం బీబీపేట మండలంలోని యాడారం గ్రామానికి చెందిన ఓ యువకుడితో చేయడానికి కుల పెద్దలు నిర్ణయించారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్, రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలతో మాట్లాడి, బాలికకు పెండ్లి చేయవద్దని, లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం బాలికను కామారెడ్డిలోని సఖీ కేంద్రానికి తరలించారు.

సంక్షిప్తం

మాజీ ప్రధాని మరణం దేశానికి తీరని లోటు

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని, ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ఉపాధి హామీ, ఆధార్, ఆర్టీఐ, విద్యా హక్కు చట్టం తీసుకొచ్చిన వ్యక్తి మన్మోహన్ అని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

బాన్సువాడ రూరల్: తెలంగాణలో అడిగితే అరెస్టులు, ప్రశ్నిస్తే కేసులు పెడ్తున్నారని బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ నాయకులు ఎర్రవాటి సాయిబాబా అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రొల్ల శ్రీనివాస్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్టులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

సోమార్‌పేట్‌లో వందశాతం విద్యుత్ బిల్లులు వసూలు

ఎల్లారెడ్డిరూరల్: సోమార్‌పేట్‌లో వంద శాతం వ్యవసాయ బోరు బావుల విద్యుత్ బిల్లులు వసూలైనట్లు లైన్‌మాన్ బాలకిషన్ శుక్రవారం తెలిపారు. గ్రామంలో 79 వ్యవసాయ బోరు బావులకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటి బిల్లు 35 వేల 285 రూపాయలు రైతుల నుంచి వసూలు చేయడం జరిగిందన్నారు. ఫోర్‌మాన్ గంగాధర్, తదితరులున్నారు.

జనవరి 4న అరుణాచలం యాత్ర

ఆర్మూర్‌టౌన్: అరుణాచలం గిరిప్రదక్షిణ కోసం ఆర్మూర్ ఆర్టీసీ డిపో నుంచి బస్సు యాత్ర (సూపర్ లగ్జరీ) జనవరి 4న మధ్యాహ్నం 3.00 గంటలకు బయలుదేరనున్నట్లు డీఎం రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలం, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, జోగులాంబ యాత్రకు టికెట్ పెద్దలకు రూ. 4200, పిల్లలకు రూ. 3400 ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9948775487ను సంప్రదించాలని కోరారు.

సోమార్‌పేట్‌లో వందశాతం విద్యుత్ బిల్లులు వసూలు

ఎల్లారెడ్డిరూరల్: సోమార్‌పేట్‌లో వంద శాతం వ్యవసాయ బోరు బావుల విద్యుత్ బిల్లులు వసూలైనట్లు లైన్‌మాన్ బాలకిషన్ శుక్రవారం తెలిపారు. గ్రామంలో 79 వ్యవసాయ బోరు బావులకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటి బిల్లు 35 వేల 285 రూపాయలు రైతుల నుంచి వసూలు చేయడం జరిగిందన్నారు.

ఏటీఎంను మార్చి డబ్బులు చోరీ

కామారెడ్డి క్రైం: ఓ కేటుగాడు ఏటీఎం కార్డును మార్చి ఓ వ్యక్తిని బురిడి కొట్టించి, డబ్బులు డ్రా చేసిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన రాజు సిరిసిల్ల రోడ్డులో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకోవడానికి వెళ్లాడు. ఏటీఎం నుంచి డబ్బులు రాకపోవడంతో వెనకాలే ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి తాను డబ్బులు తీసి ఇస్తానని నమ్మించాడు. రాజు ఏటీఎం, పిన్ నెంబర్ తీసుకుని డబ్బులు రావడం లేదంటూ ఏటీఎం కార్డును మార్చి, రాజుకు ఇచ్చేసి వెళ్ళిపోయాడు. తర్వాత కొద్దిసేపటికి రాజు ఫోన్‌కు తన అకౌంట్ నుంచి రూ.40వేలు డ్రా అయినట్లు మెసేజులు వచ్చాయి. మోసపోయినట్లు తెలుసుకొని రాజు వెంటనే బ్యాంకుకు వెళ్లి తన కార్డు బ్లాక్ చేయించడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

బోధన్ రూరల్: సాలూర మండలం సాలంపాడ్ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామంలోని ఎడపల్లి నర్సారెడ్డి అనే వ్యక్తి ఈనెల 21న తన ఇంటికి తాళం వేసి, భార్యతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. గురువారం రాత్రి వారు తిరిగి ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లోని 2 తులాల బంగారం, నాలుగు తులాల వెండి, రూ.25వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. ఈమేరకు బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం అదృశ్యమైన ఓ వ్యక్తి శుక్రవారం శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. దొండి మోహన్(45) అనే వ్యక్తి కొంతకాలంగా కమ్మర్‌పల్లిలో పూల వ్యాపారం చేసుకుంటూ సాయిబాబా కాలనీలో నివాసం ఉంటున్నాడు. భార్య గంగామణితో పాటు, పిల్లలు ఉన్నారు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మోహన్ తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో భార్య గంగామణి పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసుగా పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం ఉప్లూర్ రోడ్‌లో ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువలో ఓ శవం తేలియాడుతూ స్థానికులకు కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చి, మృతదేహాన్ని దొండి గంగామోహన్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి అప్పులు ఉన్నట్లు తెలిసింది. ఆ బాధతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామ సమీపంలోని పాముల వాగు వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామానికి చెందిన వడ్ల కృష్ణమూర్తి తన బైక్‌పై లింగంపేట నుంచి కామారెడ్డి వైపు వెళ్తుండగా పాములవాగు వంతెన మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కృష్ణమూర్తి చేయి విరగడంతోపాటు తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108 అంబులెన్సులో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

గంజాయి పట్టివేత



సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ గిర్ని చౌరస్తా వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురి వద్ద గంజాయి లభించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేష్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు. భీంగల్ మండలం బడాభీంగల్ గ్రామానికి చెందిన ఒరగంటి శ్రీనివాస్, చిత్తరి అరుణ్, ఓ బాలుడు ముగ్గురు కలిసి ఒకే బైక్‌పై వస్తుండగా, వారిని ఆపి సోదా చేయగా వారి వద్ద 60 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. వారిని విచారించగా భీంగల్ మండలం మెండోరా గ్రామానికి చెందిన కనక యశ్వంత్, బోదాసు నరేష్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారన్నారు. అధిక ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకోవడానికి పెద్దవాల్గోట్ గ్రామంలో వారి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారన్నారు. దీంతో పెద్దవాల్గోట్ గ్రామానికి వెళ్లి యశ్వంత్, నరేష్‌ను పట్టుకొని, వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు. ఎస్సై ఎల్ రామ్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

సిమెంట్ లారీ బోల్తా



నవీపేట: మండల కేంద్రంలో శుక్రవారం సిమెంటు లారీ బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. హైదరాబాద్ నుంచి గుజరాత్ వైపు వెళ్తున్న సిమెంటు లారీ అదుపుతప్పి నవీపేట రైల్వే గేట్ సమీపంలో బోల్తా పడింది. డ్రైవర్ ఇసుఫ్, క్లీనర్ సాజిద్‌లకు ఎలాంటి గాయాలు కాలేదు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


ఆర్మూర్‌టౌన్: మండలంలోని ఇస్సాపల్లి గ్రామ శివారులో శుక్రవారం మధ్యాహ్నం ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో లక్ష్మయ్య(20) అనే కూలీ మృతిచెందాడు. వివరాలు ఇలా.. ఉన్నాయి. ఇస్సాపల్లి ఇటుకబట్టి నుంచి ఇటుక లోడ్‌తో ట్రాక్టర్ వెళుతుండగా మూలమలుపు వద్ద డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న లక్ష్మయ్య అనే ఇటుకబట్టి కూలీ ఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఆర్మూర్‌టౌన్: మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన యాతగిరి నాగేంద్ర(21) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూర్ జిల్లాకు చెందిన నాగేంద్ర అంకాపూర్‌లో నివాసం ఉంటూ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగ అనారోగ్య సమస్యల కారణంగా ఈనెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో నాగేంద్ర మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఒకరోజు సామాజిక సేవ చేయండి

- మందుబాబులకు బోధన్ కోర్టు శిక్ష



బోధన్ కోర్టు ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం

బోధన్‌టౌన్(బోధన్): బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన ముగ్గురికి, గొడవపడ్డ ఐదుగురికి ఒకరోజు సామాజిక సేవ చేయాలని బోధన్ కోర్టు శుక్రవారం శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ముగ్గురిని, పట్టణంలోని గోసంగి బస్తీలో గొడవపడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకొని, కోర్టులో హాజరుపర్చారు. విచారణ అనంతరం వీరందరికీ ఒకరోజు సామాజిక సేవ చేయాలని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేశసాయి తల్ప తీర్పును వెల్లడించారు. తీర్పు అమలులో భాగంగా కోర్టు ఆవరణలో చెట్లతోపాటు చెత్తచెదారాన్ని వారు శుభ్రం చేశారని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని హెచ్చరించారు.

హత్య కేసులో ఒకరికి జీవితఖైదు

ఎల్లారెడ్డి: పట్టణంలో వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడికి జీవితఖైదు విధిస్తు జిల్లా న్యాయమూర్తి వీఆర్‌ఆర్ వరప్రసాద్ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ సింధూశర్మ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. ఎల్లారెడ్డిలో ఒంటరిగా నివాసముండే శేర్ల సుజాత (55)ను గంగుల శ్రీనివాస్ అలియాస్ డీజే శ్రీను 2022 డిసెంబర్ 10న హత్య చేసి, ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెలతాడు, తులం బంగారు గుండ్లను ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ అనంతరం నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.20వేల జరిమానాను జడ్జి విధించినట్లు ఎస్పీ తెలిపారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి 15నెలల జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లి శివారులోగల భూమిని అమ్ముతామని డబ్బులు తీసుకొని మరొకరికి భూమిని విక్రయించి చీటింగ్ చేసిన కేసులో ఇద్దరికి 15నెలల జైలు శిక్ష పడింది. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ఆచన్‌పల్లి శివారులో భూమిని అమ్ముతామని ఫిర్యాదుదారుని వద్ద ఆవుల జగన్ మోహన్‌రావ్, ఆవుల జీవన్ బాబు అనే ఇద్దరి వ్యక్తులు రూ. 7లక్షలు తీసుకున్నారు. మిగితా డబ్బులు ఇచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పి బాండ్ పేపర్ రాశారు. కానీ కొన్ని రోజుల తర్వాత మరొకరికి భూమిని విక్రయించారని, 2013లో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టులో కేసు నడువగా, శుక్రవారం ఆవుల జగన్‌మోహన్‌రావ్, ఆవుల జీవన్‌బాబుకు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పూజిత 15 నెలల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తు తీర్పును వెల్లడించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 3రోజుల జైలు

ఖలీల్‌వాడి: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష పడ్డట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఇటీవల మద్యం తాగి వాహనాలు నడిపిన 12మందికి కౌన్సెలింగ్ నిర్వహించగా, అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చామన్నారు. వారిలో 11 మందికి రూ. 15,500 జరిమానా విధించగా, చంద్రశేఖర్ కాలనీకి చెందిన షేక్ అబ్బాస్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన కారం మహేందర్ (45) ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మహేందర్ ఇల్లు నిర్మించుకోవడానికి అప్పులు చేశాడు. వాటిని తీర్చలేని పరిస్థితిలో అప్పుల బాధ తట్టుకోలేక ఒత్తిడికి గురై గడ్డి మందును గురువారం రాత్రి తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సాలూర మండల కేంద్రంలో..

బోధన్‌రూరల్: సాలూర మండల కేంద్రం శివారులో బోధన్‌కు చెందిన ఆరుగొండ మహేశ్(30) ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మహేశ్ గత కొంతకాలం నుంచి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈనెల 26న ఇంటి నుంచి రాత్రి సమయంలో బయటకు వెళ్లి తిరిగిరాలేదు. సాలూర శివారులో చెట్టుకు ఉరివేసుకొని ఉండగా, మృతదేహాన్ని మహేశ్‌గా పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం



నిజామాబాద్ రూరల్: ముబారక్‌నగర్‌లోని వీవీనగర్‌కాలనీకి చెందిన తెలన్గ విజయలక్ష్మీ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరీఫ్ శుక్రవారం తెలిపారు. విజయలక్ష్మీ గత కొన్ని రోజులుగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చికిత్స తీసుకుంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఆమె ఇంట్లో ఎవరికి చెప్పకుండ బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వృద్ధురాలు ఎరుపురంగు చీర, క్రీంకలర్ జాకెట్ ధరించి ఉందని, ఎవరికైనా ఆచూకీ లభించినచో 87126 59849, 87126 59847ను సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతంనగర్‌లో చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. కాలనీలోని భక్త మార్కండేయ మందిరంలో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించగా స్థానికులు గమనించి, డయల్ 100కు సమాచారం అందించారు. అప్పటికే దొంగ పారిపోగా త్రీటౌన్ బ్లూకోర్ట్ సిబ్బంది గంగాధర్, నిఖిల్ అతడిని పట్టుకున్నారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.